Andhra Bhoomi Dt 21/06/15

# సిఇవోల సైకిల్ సవారీ

- ఆకట్టుకున్న పది కి.మీ.ల సైక్లింగ్ పరుగు
- పర్యావరణ,ఆరోగ్య పరిరక్షణే నినాదం
- మెట్రో స్టేషన్లలో సైకిళ్లు!

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జూన్ 20: జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన బహుళ జాతి కంపెనీలకు చెందిన 150 మంది చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్లు కలిసికట్టుగా అందరూ ఒకే సారి సైకిళ్లు ఎక్కారు. పర్యావరణ, ఆరోగ్య పరిరక్షణే ప్రధాన నినాదంతో పదికిలోమీటర్ల పొడువున సాగిన ఈ సైకిల్ రేస్ అందర్నీ ఆకట్టుకుంది.



సైకుల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పరుగు శనివారం మాదాపూర్‌లోని రహెజా మైండ్ స్పేస్ నుంచి ప్రారంభమై పది కిలోమీటర్ల పొడువున సాగింది. తెలంగాణ ప్రభుత్వం ఐటి కార్యదర్శి డా.జయేశ్ రంజన్, వొడాఫోన్ ఇండియా బిజినెస్ హెడ్ రోహిత్ టాండన్‌లు ప్రారంభించిన ఈ పరుగులో

మిగతా 2లో

# సిఇవోల సైకిల్ సవారీ

**(1వపేజీ తరువాయి)** సైబరాబాద్ పోలీసు కమిషనర్ సివి.ఆనంద్, హైదరాబాద్ మెట్రోరైలు మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎన్వీఎస్.రెడ్డి, మాజీ ఎంపి వివేక్, ట్రాఫిక్ డిసిపి అవినాశ్ మహంతి, ఇన్ఫోసిస్ కంపెనీ సీనియర్ ఉపాధ్యక్షులు నర్సింహారావు మన్నెపల్లి, ఫొనెక్స్ గ్రూప్ డైరెక్టర్ సతీష్ చుక్కపల్లి, పారిశ్రామిక వేత్త శ్రీనిరాజు, సిఐఐ తెలంగాణ చైర్ పర్సన్ వనిత డాట్లలతో పాటు మొత్తం 150 మంది సిఇవోలు, పేరుగాంచిన పరిశ్రమలు, కంపెనీల అధినేతలు సైకిల్ రేసులో పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం జయేశ్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని సైక్లింగ్‌కు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. సైబరాబాద్ కమిషనర్ సివి.ఆనంద్ మాట్లాడుతూ నగరాన్ని కాలుష్యరహిత సిటీగా తీర్చిదిద్దేందుకు పోలీసుల తరపున పూర్తి సహాయ సహకారాలుంటాయని వివరించారు.

అనంతరం డా.ఎన్వీఎస్.రెడ్డి మాట్లాడుతూ రహదార్లు ఏర్పాటు చేస్తున్నది ప్రజల కోసమేనని, కార్లు, ఇతరత్ర భారీ వాహనాల కోసం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పదికిలోమీటర్ల సైకిల్ ప్రయాణం తనకు మరువలేని మధురానుభూతిని ఇచ్చిందని, సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, అంతేగాక, పర్యావరణం కలుషితం కాకుండా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గుర్తుంచిన తాము మెట్రోరైలు ప్రతిపాదనల స్థాయి నుంచే ప్రతి మెట్రో స్టేషన్‌లో అక్కడి నుంచి సమీపంలో ఉన్న ఐటి, ఇతరత్ర సంస్థలకు చేరుకునేందుకు సైకిళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రతి స్టేషన్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచే ఈ సైకిళ్లను రోజూ మెట్రోరైల్‌లో ప్రయాణించే వారు ఉపయోగించుకునేందుకు ప్రత్యేకంగా ఓ విధానాన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ ఐటి, ఇతర సంస్థల్లో విధులు నిర్వర్తించే వారి సౌకర్యార్థం ప్రతి మెట్రో స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు బస్సుల రాకపోకలను కూడా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ నగరంలో గతంలో రోడ్లపై చాలా సైకిళ్లు కన్పించేవని, కాలక్రమేనా కనుమరుగవుతున్న సైకిల్ ప్రయాణానికి పూర్వవైభవాన్ని తీసుకువచ్చి, ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ రక్షణ దిశగా నగరాన్ని పీపుల్స్ ఫ్రెండ్లీ గ్రీన్ హైదరాబాద్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎంపి వివేక్ మాట్లాడుతూ పదికిలోమీటర్ల పొడువున సైకిల్‌పై ప్రయాణించిన తనకు హాయిగా ఉందని, ఆరోగ్య పరంగా సైక్లింగ్ ఎంతో మంచిదని తెలిపారు. పేరుగాంచిన జాతీయ, బహుళ జాతి కంపెనీలకు చెందిన సిఇవోలు ఈ రకంగా సైకిల్‌పై ప్రయాణం చేసి ప్రమోట్ చేయటం కింది స్థాయి ఉద్యోగులను సైకిల్ ప్రయాణం పట్ల ఆకర్షితులను చేస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాలుష్యానికి ఏ మాత్రం అవకాశం లేకపోవటంతో ప్రతి ఒక్కరూ సైకిల్ ప్రయాణాన్ని అలవర్చుకుంటే ఆరోగ్యపరంగా ఎంతో శ్రేయస్కరమని అన్నారు. అనంతరం సైకుల్ సంస్థ వ్యవస్థాపకులు, సిఇవో దీనానాథ్ హరపానహల్లి మాట్లాడుతూ దేశంలోనే సైక్లింగ్‌ను ప్రోత్సహించే విధంగా, ప్రతి ఒక్కరి జీవన విధానంలో సైక్లింగ్‌ను ఓ భాగం చేయాలన్న ఉద్దేశ్యంతో సంస్థను స్థాపించినట్లు తెలిపారు.

Andhra prabha Dt 21/06/15

# సైక్లింగ్‌పై అవగాహన సదస్సు

● ముఖ్య అతిథిగా పాల్గొన్న సీవీ.ఆనంద్..




సమావేశంలో పాల్గొన్న సీవీ ఆనంద్ తదితరులు

మాదాపూర్, జూన్ 20 (కెఎన్ఎన్) : మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో నిర్వహించిన సైక్లింగ్ అవగాహన సదస్సులో సైబారాబాద్ కమిషనర్ సీవీ.ఆనంద్, తెలంగాణ ఐటీ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజాన్‌లు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీవీ.ఆనంద్ మాట్లాడుతూ సిగ్నల్ జంపింగ్ చేయకండి. మద్యం సేవించి వాహనాలను నడపరాదని తెలిపారు. టూ వీలర్ మోటర్ బైకుల స్థానంలో సైకిళ్లను తప్పకుండా వాడాలని తెలిపారు. ఈ విధమైన సైక్లింగ్ చర్యల వల్ల శరీరానికి వ్యాయామం చేసినట్లవుతుందని, కలుష్యాన్ని నిరోధించవచ్చని, ట్రాఫిక్ నియంత్రణ కూడా సాధ్యమని, ఇలా ఎన్నో లాభాలున్నాయని తప్పకుండా అందరూ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ సంస్థలకు చెందిన 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఐటీ కారిడార్లలో సైక్లింగ్ ట్రాక్ తక్కువగా ఉన్నాయని, వాటిని కూడా త్వరలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్ అవినాష్ మోహంతి, మాదాపూర్ డీసీపీ కార్తికేయ, ప్రదీప్ మిట్టల్, వివేక్, మురళీబాలు, వాగీష్ దీక్షిత్, ప్రసాద్‌రెడ్డి, మన్నేపల్లి నర్సింహారావు, అంజిత్‌సర్కార్, విక్రంజోషి తదితరులు పాల్గొన్నారు.



Eenadu

Dt 21/06/15

# కారు దిగారు... సైకిల్ తొక్కారు...!





మాదాపూర్: వారంతా వివిధ కార్పొరేట్ సంస్థలకు సీఈఓలు. నిత్యం కంపెనీ పనుల్లో హడావుడిగా ఉంటారు. శనివారం మాత్రం తమ కార్లను వదిలి సైకిళ్లు తొక్కారు. దాదాపు 200 మంది సీఈఓ స్థాయి కార్పొరేట్ ఉద్యోగులు సైకిల్ రైడ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పది కి.మీ సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి సైక్లింగ్ ప్రాముఖ్యతను చాటారు. ఈ కార్యక్రమానికి మాదాపూర్‌లోని రహేజా మైండ్‌స్పేస్ వేదికైంది. సైక్లింగ్ కల్చర్‌ను మరింతగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సైకుల్ సంస్థ ఆధ్వర్యంలో 'చీఫ్స్ ఆన్ ఏ రోల్' పేరిట సైకిల్ రైడ్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ఐటీ శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్, సైబరాబాద్ సీపీ సి.వి.ఆనంద్, మెట్రోరైల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ అవినాష్ మహంతి, వోడాఫోన్ బిజినెస్ హెడ్ రోహిత్ టాండన్, సైకుల్ సంస్థ వ్యవస్థాపకులు దీనానాథ్‌లు రైడ్‌ను ప్రారంభించారు.

## మౌలిక వసతులు కల్పించాలి

– రమేష్ లోగనాథన్, ప్రోగ్రెస్ సాఫ్ట్‌వేర్ మేనేజింగ్ డైరెక్టర్



నగరంలో సైక్లింగ్ చేసేందుకు వసతులు కల్పించాలి. ప్రస్తుతం ఒక్క చోటే సైకిల్ ట్రాక్ ఉంది. మా కంపెనీలో సైకిల్‌పై వచ్చే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాం. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటం, ప్రత్యేక సైకిల్ ట్రాక్ లేకపోవడం వల్ల సైకిల్ టూ వర్క్‌కు స్పందన రావడం లేదు.

## నాలుగేళ్లుగా చేస్తున్నా

– బిపిన్ చంద్రదత్, సువిటాస్ హెల్త్‌కేర్ సంస్థ డైరెక్టర్



నేను నాలుగేళ్లుగా సైక్లింగ్ చేస్తున్నా. వారాంతంలో సైకిల్‌పై నగర శివారు ప్రాంతానికి దాదాపు 20 నుంచి 40 కి.మీ సైకిల్‌రైడ్‌కు వెళ్తాను. నాతోపాటు నా స్నేహితులు, కూతురు వస్తుంటారు. సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. సైకిల్ తొక్కడం రాని వారు చాలా తక్కువగా ఉంటారు. ప్రతి ఒక్కరు చిన్నప్పుడే నేర్చుకుంటారు. ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేసే సైక్లింగ్‌ను ప్రస్తుత యాంత్రిక జీవనంలో చాలా మంది విస్మరిస్తున్నారు. దీన్ని మరింతగా ప్రోత్సహించాలి. హైదరాబాద్ సైకిల్ సిటీగా మారాలి.

## గండిపేట చుట్టూ...

– శ్రీనుబాబు, ఓమిక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్



గండిపేట సమీపంలో ఉంటాను. రోజు ఉదయమే సైకిల్‌పై గండిపేట చుట్టూ సైక్లింగ్ చేస్తాను. చదువుకునే రోజుల్లో సైకిల్ తొక్కడం అలవాటు. తరువాత నగరంలో సైక్లింగ్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి నేను కూడా మొదలుపెట్టాను. రోజు గంట సైక్లింగ్ చేస్తే ఆ రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. మా కంపెనీ ఉద్యోగులను సైతం సైక్లింగ్‌కు ప్రోత్సహిస్తున్నాం.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్వీఎస్ రెడ్డి, సీవీ ఆనంద్, జయేష్‌రంజన్

**సైక్లింగ్ చేసే వారి సంఖ్య పెరగాలి:** జయేష్‌రంజన్

నగరంలో సైక్లింగ్ చేసే వారి సంఖ్య పెరిగితే వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్ అన్నారు. శనివారం మాదాపూర్‌లోని రహేజా మైండ్‌స్పేస్‌లో సైకుల్ సంస్థ నిర్వహించిన సీఈఓల సైకిల్ రైడ్‌కి జయేష్‌రంజన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏడాది క్రితం ఐటీ కారిడార్‌లో 'సైకిల్ టూ వర్క్'కి శ్రీకారం చుట్టామని ఏడాదిలో కనీసం వెయ్యిమంది సైకిళ్లపై కంపెనీలకు వెళ్లాలనే లక్ష్యమన్నారు.

## మంచి వ్యాయామం

– వనిత దాట్ల, సీఐఐ తెలంగాణ చాప్టర్ హెడ్



సైక్లింగ్ అంటే చాలా ఇష్టం. ప్రతి రోజు చేయడం వల్ల ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు ఉండవు. ఇప్పటి వరకు అనేక సైకిల్ రైడ్స్‌లో పాలుపంచుకున్నాను. నగరంలో ట్రాక్స్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సనత్‌నగర్, బాలానగర్ లాంటి ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో సైకిల్‌పై వెళ్లడం ఎంతో కష్టంగా ఉంటుంది. ట్రాక్స్ ఏర్పాటు చేస్తే మంచి స్పందన ఉంటుంది.

# సైకిల్ రైడ్.. @ 10 కి.మీ.

- వెస్టిన్ హోటల్ వద్ద ప్రారంభం
- పాల్గొన్న 200 కంపెనీల సీఈఓలు
- సైకిల్ ఉపయోగించాలని ప్రతిజ్ఞ





విధులకు సైకిల్‌పై వస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఐటీ ఉద్యోగులు, సైకిల్ రైడ్‌లో పాల్గొన్న మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, తదితర కంపెనీల ఉద్యోగులు

హఫీజ్‌పేట్, జూన్ 20 : వారంతా పెద్దపెద్ద కంపెనీలకు యజమానులు, అయినా కిలో మీటర్ల కొద్దీ సైకిల్ రైడ్ చేసి ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలిచారు. మాదాపూర్ వెస్టిన్ హోటల్ వద్ద శనివారం సైకల్ సంస్థ ఆధ్వర్యంలో 'చీఫ్స్ ఆన్ రోల్' పేరిట సైకిల్ రైడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 కంపెనీలకు చెందిన సీఈఓలు పాల్గొని, 10 కిలో మీటర్ల మేర సైకిల్ తొక్కారు. ఈ సైకిల్ రైడ్‌ను తెలంగాణ ఐటీ శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్, వొడాఫోన్ బిజినెస్ హెడ్ రోహిత్ టండన్ జెండా ఊపి ప్రారంభించారు. వెస్టిన్ హోటల్ నుంచి ప్రారంభమైన ఈ రైడ్.. ఇనార్బిట్ మాల్ మీదుగా మైండ్ స్పేస్ జంక్షన్ నుంచి తిరిగి వెస్టిన్ హోటల్ వరకు దాదాపు 10 కిలో మీటర్ల మేర కొనసాగింది. అనంతరం వెస్టిన్ హోటల్‌లో 'మేకింగ్ హైదరాబాద్ ఏ సైక్లింగ్ క్యాపిటల్' పేరిట ప్యానల్ డిస్కషన్ నిర్వహించారు. అనంతరం సీఈవోలతో స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఉద్యోగులు సైకిల్‌ను ఉపయోగించేలా చేస్తామని జయేష్‌రంజన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ డిస్కషన్‌లో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ.ఎన్వీఎస్‌రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్, సీఐఐ తెలంగాణ హెడ్ వనితా డాట్లా, సైకల్ ఫౌండర్ దీనానాథ్ హర్పనపల్లి పాల్గొన్నారు. ఈ సైకిల్ రైడ్‌లో మాజీ ఎంపీ వివేక్, ట్రాఫిక్ డీసీపీ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ కార్తికేయ, టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ వెంకట్‌నర్సింహరెడ్డి, హైదరాబాద్ ఎంజెల్స్ చైర్మన్ ప్రదీప్‌మిట్టల్, ఎర్నస్ట్, యంగ్ సీఈవో కలి ప్రసాద్, ఒమిక్స్ ఇంటర్నేషనల్ సీఈవో శ్రీనుబాబు, జేపీ చౌదరి, వివిధ కంపెనీల సీఈవోలు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న మాజీ ఎంపీ వివేక్

## మరిన్ని సైకిల్ ట్రాక్‌లు



గతంలో సైకిల్ టు వర్క్ కార్యక్రమం ద్వారా దాదాపు వెయ్యి మంది ఉద్యోగులను భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. అందులో 400 మంది మాత్రమే సైకిల్ టు వర్క్ ద్వారా సైకిళ్లపై వస్తున్నారు. వీటి కోసం సపరేట్ సైకిల్ ట్రాక్‌లను నెలకొల్పి ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. దీనికి తోడు కంపెనీ ఉద్యోగులకు లోపల కూడా సైకిళ్లపై తిరిగే అలవాటును చేయాల్సిన అవసరం ఉంది.

– జయేష్‌రంజన్, తెలంగాణ ఐటీ శాఖ కార్యదర్శి

## మెట్రో స్టేషన్లలో సైకిల్ స్టాండ్ల ఏర్పాటు



నగరంలో కార్లు విపరీతంగా పెరగిపోతున్నాయి. ఇలా అయితే రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించలేకపోతాం. సైకిల్ అనేది ప్రయాణానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చు. హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో సైతం సైకిల్ స్టాండ్లను ఏర్పాటు చేస్తాం. దాదాపు 63 స్టేషన్లలో వీటిని ఏర్పాటు చేయిస్తా.

– ఎన్వీఎస్.రెడ్డి, మెట్రో రైల్ ఎండీ

## మహిళలు స్వేచ్ఛగా సైకిల్ తొక్కగలగాలి



నగరంలో ఓ మహిళ సైక్లింగ్ చేయడం చాలా కష్టం. సైక్లింగ్ చేయడానికి రోడ్డుపై సదుపాయం కల్పించాలి. నేను నా పిల్లలకు రోల్ మోడల్‌గా ఉండాలనుకుంటున్నా. సీఈవోలు సైక్లింగ్ చేయడం వల్ల వారి కింది టీం ఎంతో స్ఫూర్తి పొందే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌లో సైకిల్ ఫ్రెండ్లీ సిటీ కావాలని నా కల.

– వనితా డాట్లా, సీఐఐ తెలంగాణ హెడ్

## రోజు 10 కి.మీ. సైకిల్ తొక్కుతా



సీఈవో అయినా సైకిల్ మరవలేదు. రెండేళ్ల నుంచి ఉదయం సమయంలో దాదాపు 10 కిలో మీటర్ల మేర సైక్లింగ్ చేస్తా. చిన్నప్పుడు స్కూల్‌కు సైకిల్‌పై వెళ్లేవాణ్ని. ఇప్పుడు సీఈవోగా అయినప్పటికీ సైక్లింగ్ చేయడం వలన ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా తోటి ఉద్యోగులకు కూడా ఒక ఇన్స్పిరేషన్‌గా పని చేస్తుంది.

– శ్రీనుబాబు, ఒమిక్స్ ఇంటర్నేషనల్ సీఈవో

## త్వరలో మహిళల కోసం షీ 'షటిల్స్'



గతంలో ఐటీ ఉద్యోగుల కోసం సైకిల్ టు వర్క్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినప్పటికీ అది పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఐటీ కారిడార్‌లో దాదాపు 30కిలో మీటర్ల మేర సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. ఇలాంటి కార్యక్రమంలో కంపెనీ సీఈవోలు పాల్గొనడం వలన కింది స్థాయి ఉద్యోగులు సైతం సైకిల్‌పై ఉద్యోగానికి వచ్చేందుకు స్ఫూర్తి కలుగుతుంది. దీని ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. మహిళా ఉద్యోగుల కోసం రెండు షీ షటిల్ బస్సులు ఈ నెల 29వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ బస్సులను ఐటీ శాఖ మంత్రి కల్లకుంట్ల తారకరామారావు, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించనున్నారు. అదేవిధంగా ప్రతీ గురువారం ఐటీ ఉద్యోగులు సైకిళ్లపై వచ్చేందుకు ఈ నెల 23 నుంచే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఆ సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

– సీవీ.ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్